ఆటోడ్రైవర్ వినూత్న ప్రచారం

పండుగ బాబు వీపు బాగంలో వేసుకున్న కేసీఆర్ చిత్రపటం

పండుగ బాబు కడుపు, చాతీ భాగంలో నినాదాలు, కారు గుర్తు

చేర్యాల, ఏప్రిల్ 17: మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పండుగ బాబు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వీర అభిమాని. రజతోత్సవ సభ విజయవంతం కావాలని, కేసీఆర్ సార్ మళ్లీ రావాలని కోరుతూ తన ఒంటిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటాన్ని వేసుకొని వినూత్నంగా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడు. జై కేసీఆర్, జైజై కేసీఆర్ నినాదాలతో పాటు కేసీఆర్ చిత్రపటాన్ని వీపుపై వేసుకున్నాడు. మీరే కావాలని, మీరే రావాలని, కేసీఆర్ బాపు, జై తెలంగాణ అనే నినాదాలతో పాటు కారు గుర్తు ఉన్న చిత్రపటాన్ని కడుపు, ఛాతిభాగంలో వేసుకొని తన అభిమానం చాటడమే కాకుండా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడు.

రజతోత్సవ సభకు ఇంటింటా ప్రచారం

చేర్యాల, ఏప్రిల్ 17: బీఆర్ఎస్ బహిరంగ సభకు తరలిరావాలని కోరుతూ పట్టణంలోని 12వ వార్డులో యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గురువారం వేకువజామున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను గోడలకు అతికించి సభకు తరలిరావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, నాయకులు రాచకొండ శ్రీనివాస్, పచ్చిమడ్ల మానస, ఉట్కూరి అమర్‌గౌడ్, పచ్చిమడ్ల బాచి, మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పాక బాలయ్య, మహేందర్, అవుశెర్ల కిషోర్, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలోని 12వ వార్డులో వాల్‌పోస్టర్లు అతికిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రజతోత్సవ సభకు విరాళం

చేర్యాల, ఏప్రిల్ 17: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు పట్టణానికి చెందిన వ్యాపారి కందుకూరి సిద్దిలింగం గుప్త రూ.2500ల విరాళాన్ని గురువారం అందజేశారు. బీఆర్ఎస్ వార్డు ఇన్‌చార్జి యాట యాదగిరికి ఈ విరాళాన్ని అందజేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నారని, ప్రజలు ఆయనకు అభిమానులుగా మారిపోయారని సిద్దిలింగం గుప్త అన్నారు.

విరాళం అందజేస్తున్న సిద్దిలింగం గుప్త

కాంగ్రెస్ నుంచి సొంత గూటికి..

బీఆర్ఎస్ మండల నాయకులతో భాస్కర్, దేవేందర్

జగదేవపూర్ ఏప్రిల్ 17: మండలంలోని దౌలాపూర్‌కు చెందిన మాజీ ఉపసర్పంచ్ జూపల్లి భాస్కర్, మాజీ వార్డు మెంబర్ ఈరమైన దేవేందర్ గురువారం కొండపోచమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్, మండల నాయకుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన భాస్కర్, దేవేందర్‌లు తిరిగి సొంత గూటికి చేరగా వారికి మండల బీఆర్ఎస్ నాయకులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మండల నాయకులు రంగారెడ్డి, యాదవరెడ్డి, నాగరాజు, కవిత, నరేశ్, మహేశ్, దాచారం కనకయ్య, ఎక్బాల్, నర్సయ్య, శ్రీను ఉన్నారు.

కరాటేలో బెల్టుల ప్రదానం

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 17: మండలంలోని దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం కరాటే గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ గ్రేడింగ్ టెస్ట్‌లో సోయల్, గౌరిప్రసాద్ బ్రౌన్ బెల్టులు అందుకోగా మరో 10మంది ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, మెరూన్ బెల్టులు అందుకున్నారు. కరాటేలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పచ్చిమడ్ల మానస గౌడ్ బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణ కళగా అనేక దశాబ్దాలుగా ప్రాచుర్యం పొందిందన్నారు. ఆడ పిల్లలకు, మహిళలకు కరాటే మానసిక ధైర్యాన్ని ఇస్తుందన్నారు.

బెల్టులు ప్రదానం చేస్తున్న మానస గౌడ్

పుష్కరాలకు భారీగా తరలిరావాలి

చేర్యాల, ఏప్రిల్ 17: రాష్ట్రంలో మే 15 నుంచి జరగనున్న సరస్వతి పుష్కరాలకు ప్రజలు భారీగా తరలిరావాలని అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ కోరారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ అతిథి గృహంలో గురువారం దేవాలయ అర్చక, ఉద్యోగులు, ఆగమ పాఠశాల విద్యార్థులతో కలిసి తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ ఉగాది నుంచి ఉగాది వరకు నిర్వహించే కార్యక్రమాల తెలుగు డైరీని జేఏసీ చైర్మన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఉప ప్రధానార్చకుడు మహాదేవుని సాంబయ్య, వేద పండింతులు మధుసూదన్‌శర్మ, శబరిషన్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య అర్చకులు మల్లికార్జున్, మనోహర్, అర్చకులు శివప్రసాద్, రేవన సిద్దేశ్వర్, సూర్యకుమార్, వినయ్‌కుమార్, రవికుమార్, ఆగమ పాఠశాల అధ్యాపకులు వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో తెలుగు డైరీని ఆవిష్కరిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

బెజ్జంకి, ఏప్రిల్ 17: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగం పెంచాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్యా అధికారులకు సూచించారు. మండలంలోని గుగ్గిళ్ల, గాగిల్లాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలకు ఇబ్బంది కాకుండా పని జరిగే ప్రదేశంలో, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని సూచించాడు. అనంతరం ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే యూనిఫాం కుట్టే విధానాన్ని పరిశీలించారు. వేసవిలోనే కుట్టడం పూర్తి చేసి సకాలంలో పాఠశాలలకు యూనిఫాంలు అందించాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య, సీసీలు సారయ్య, తిరుపతి తదితరులున్నారు.

గుగ్గిళ్లలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో జయదేవ్ ఆర్యా

ఎల్కతుర్తి సభకు దండులా కదంతొక్కాలి

- ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

గజ్వేల్, ఏప్రిల్ 17: బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ ఎల్కతుర్తికి కార్యకర్తలు దండులా కదం తొక్కాలని, ప్రతి కార్యకర్త సభకు తరలివచ్చేలా ఆహ్వానించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మండల కార్యకర్తల సమావేశం పట్టణంలోని శోభా గార్డెన్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ వరంగల్‌లో నిర్వహించే సభ పార్టీకి ఎంతో ప్రతిష్ఠాత్మకమని, ప్రతిఒక్కరూ ఉప్పెనలా కదలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుండెల్లో రైళ్లు పరుగెత్తే విధంగా సభ నిర్వహణ ఉంటుందన్నారు. రాజకీయాలు అంటే జేబులు నింపుకొవడం, అవినీతికి పాల్పడడం, అందుబాటులో లేకపోవడం కాదన్నారు. అబద్ధపు పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ 15నెలల కాలంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఆరు గ్యారెంటీలను విస్మరించిందన్నారు. అవినీతి లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గడపగడపకు సంక్షేమ ఫలాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ తులం బంగారం, పెంచుతామన్న పెన్షన్లు, మహిళలకు రూ. 2500, విద్యార్థులకు స్కూటీలు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌లను ఇవ్వడం లేదని, రైతు భరోసా, పంట రుణమాఫీ అందరికీ వర్తింపజేయడం లేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఊసే లేదని, ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాలతో రియల్టర్లు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. గజ్వేల్‌ను కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని, ఆయన చేసిన అభివృద్ధే నేడు గ్రామాల్లో కన్పిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను దోచుకుంటున్నాయే తప్పా ప్రజలకు చేసింది శూన్యమన్నారు. సమావేశంలో గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మండలాధ్యక్షుడు మధు, మాజీ జడ్పీటీసీ ఎల్లయ్య, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, కృష్ణ, రాజేశ్వర్‌రావు, అశోక్, అంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలి

ఆకునూరులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 17: ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అన్ని వర్గాల ప్రజలకు వివరించాలని చేర్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, మాజీ ఎంపీపీ కరుణాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభ విజయవంతం కోసం గురువారం ఆయా గ్రామాల ఇన్‌చార్జిలు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. ముఖ్య నాయకులను కలిసి సమావేశాలు నిర్వహించి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర నలుమూలల నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో పాటు కాంగ్రెస్ వ్యతిరేకులు సైతం సభకు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని, రైతులు, అభిమానులు విరాళాలు సైతం అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ అధ్యక్షులు, అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 17: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలసదనంలో గురువారం లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ..చిన్నారులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. బాల్య వివాహాలు నేరమని, బాలసదనంలో ఏ సమస్యలు ఉన్నా 15100కు ఫోన్ చేయాలన్నారు. అంతకు ముందు సదనంలో తిరిగి చిన్నారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. శిశు గృహాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రమేశ్, డీసీపీయూ భాగ్య, సిబ్బంది రాజు, న్యాయసేవా అధికారులు పాల్గొన్నారు.

చిన్నారితో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

పనులను పరిశీలించిన మంత్రి పొన్నం

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 17: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు, ఆరపల్లి చౌరస్తా సుందరీకరణ పనులను గురువారం బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పరిశీలించారు. ఎల్లమ్మ చెరువు కట్టపై కలియ తిరిగారు. కప్పగుట్ట వరకు రహదారి, బ్రిడ్జిని నిర్మించే విషయాన్ని స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. కొత్త చెరువు సుందరీకరణ, ఎల్లమ్మ చెరువు ప్రాంతం నుంచి పందిల్ల బ్రిడ్జి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల విషయంలో ఆయన నాయకులతో చర్చించారు. అనంతరం ఆరపల్లి చౌరస్తా ప్రాంతంలో చేపట్టిన సుందరీకరణ పనులను పరిశీలించి చౌరస్తా మరింత విస్తరించాలని మంత్రి సూచించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ చెరువు కట్టపై పనులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

నంగునూరు, ఏప్రిల్ 17: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మగ్థుంపూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, నంగునూరు ప్యాక్స్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చక్రపాణి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అచ్చిన మల్లయ్య, నాయకులు బట్ట బాల్‌రత్నం, కడారి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జాప రాములు, తాటికొండ రాజు, బట్ట యాదయ్య, పేర్న సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

మద్దూరు: మాట్లాడుతున్న చొప్పరి రవికుమార్

చేర్యాల: ధాన్యం రాశులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 17: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, సొసైటీ సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం ధూళిమిట్ట మండల కేంద్రంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. రవికుమార్ మాట్లాడుతూ.. వరికోతలు పూర్తయి ధాన్యం సెంటర్లకు చేరుకున్నప్పటికీ కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో రైతులు సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. అకాల వర్షాలకు కేంద్రాలలో ధాన్యం తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పోతిరెడ్డి రాజు, చొప్పరి ప్రసాద్, కాశీరాములు, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

చేర్యాలలో...

చేర్యాల, ఏప్రిల్ 17: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సీపీఎం నాయకులు సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంకట్‌మావో మాట్లాడుతూ మార్కెట్‌కు రైతులు ధాన్యం తీసుకువచ్చారని, ఇప్పటికీ అధికారులు కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు. నాయకులు మల్లేశం, ప్రభాకర్, మల్లయ్య, కనకయ్య, బుట్టి మల్లయ్య, నరసవ్వ పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

మద్దూరు(ధూళిమిట్ట): జాలపల్లిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 17: ఈనెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్ కోరారు. గురువారం గ్రామంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగులపల్లి కుమార్, మాజీ ఉపసర్పంచ్ రాగుల సంపత్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సభకు భారీగా తరలిరావాలి

కోహెడ ఏప్రిల్ 17: ఈనెల 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని గుండారెడ్డిపల్లిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ నిర్వహిస్తున్న బహిరంగ సభకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సుతారి కనుకయ్య, ఎండీ రహీం, మామిడి శ్రీనివాస్, వంగ శేఖర్, నక్క సంజీవ్, పిల్లి బాబు తదితరులున్నారు.

కోహెడ: సమావేశంలో మాట్లాడుతున్న కర్ర శ్రీహరి

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 17: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందుతుందని ఎంఈవో వరదరాజు అన్నారు. గురువారం మండలంలోని రేబర్తి హైస్కూల్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలతో పాటు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రభాను, శిరీష, సంపత్, రవి, చంద్రారెడ్డి, మల్లేశం, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, రఫత్, ప్రశాంత్, కవిత పాల్గొన్నారు.

మద్దూరు: రేబర్తిలో బడిబాటలో పాల్గొన్న ఎంఈవో వరదరాజు

విజపల్లిలో...

కోహెడ ఏప్రిల్ 17: మండలంలోని విజపల్లి గ్రామం పెర్కలగడ్డ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవివర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు పిల్లలు పెద్ద సంఖ్యలో రావాలని ముందస్తుగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అమ్మ ఒడిలాంటి పాఠశాలలో పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌కు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవి, సీఆర్పీ శ్రీనివాస్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

వర్గల్, ఏప్రిల్ 17: మండలంలోని గౌరారం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్గల్ ఎంపీడీవో మశ్చేందర్, ప్రభుత్వ వైద్యురాలు హరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, గ్రామ ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. బాలింతల సంరక్షణ, చిన్నారులకు అందించే పౌష్టికాహారం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

కుశాల్‌నగర్‌లో..

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 17: పిల్లలకు పోషకాహారం అందించడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని కుశాల్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరళ అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని కుశాల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా మహిళలకు, పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారద, ఉపాధ్యాయురాలు భవానీ, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

లద్నూర్‌లో...

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 17: పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ చేర్యాల సీడీపీవో రమాదేవి అన్నారు. గురువారం మద్దూరు మండలంలోని లద్నూర్ రైతువేదికలో పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏజీ రహీం, ఎంపీడీవో రామ్మోహన్, ఏవో రామకృష్ణ, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కనకరాజు, సూపర్‌వైజర్ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డకు తల్లి పాలే ఆరోగ్యకరం

గజ్వేల్, ఏప్రిల్ 17: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలే ఆరోగ్యకరంగా ఉంటాయని, ప్రతిఒక్కరూ ముర్రు పాలు బిడ్డకు తాగించాలని జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. గురువారం జిల్లా దవాఖానను ఆర్‌వీఎం దవాఖాన బీఎస్సీ నర్సింగ్ నాలుగో సంవత్సరం విద్యార్థులు సందర్శించి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణీలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, ప్రతియేడు ప్రభుత్వం తల్లిపాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ టీచర్లు, గ్రామాల్లోని వైద్య సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీఎం దవాఖాన నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతున్న డాక్టర్ అన్నపూర్ణ

నేడు బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

దుబ్బాక, ఏప్రిల్ 17: దుబ్బాక పట్టణంలోని రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, నాయకులు వంశీ, శ్రీనివాస్ తెలిపారు. సమావేశానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి దుబ్బాక మున్సిపాలిటీతో పాటు దుబ్బాక మండలం, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

చేర్యాల, ఏప్రిల్ 17: ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సీపీఎం శ్రేణులు ప్రజలతో కలిసి ఎక్కడిక్కడ ఎండగట్టాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యలయం వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్‌మావో, పట్టణ కార్యదర్శి నాగరాజు, కమిటీ సభ్యులు మల్లేశం, శ్రీహరి, ప్రభాకర్, శోభ, రంజిత్‌రెడ్డి, సిద్దులు పాల్గొన్నారు

దరఖాస్తుల స్వీకరణ

వర్గల్, ఏప్రిల్17: మండలంలోని గౌరారంలో గల మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశానికై వచ్చేనెల 5వ తేదీవరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. 2025లో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు 40 శాతం ఉత్తీర్ణత ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎంజెపిడబ్ల్యుఆర్ఈఐఎస్.కామ్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చున్నారు.

మెప్మా కోఆర్డినేటర్‌గా సంతోషిని

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 17: హుస్నాబాద్ మెప్మా కోఆర్డినేటర్‌గా సంతోషిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. హుస్నాబాద్ మెప్మా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ముత్యాల రాజు గజ్వేల్‌కు బదిలీ చేస్తూ ఆయన స్థానంలో సంతోషిని నియమిస్తూ మెప్మా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

వక్ఫ్ బిల్లును రద్దు చేయాలి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 17: వక్ఫ్ చట్టం రద్దయ్యే వరకు ముస్లింల పోరాటం ఆగదని సిద్దిపేట ముస్లిం జేఏసీ సభ్యులు అబ్దుల్ సమీ, కరీమొద్దీన్ స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అక్కన్నపేట, ఏప్రిల్ 17: మండలంలోని గొల్లకుంటకు చెందిన గూడురు మల్లేశం (58) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లకుంటకు చెందిన మల్లేశం ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి భీమదేవరపల్లి మండలం మల్లారం వెళ్తున్నాడు. కట్కూరు- మల్లారం మధ్యలో కొత్తకొండ నుంచి వస్తున్న ట్రాక్టర్ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మల్లేశం తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందగా, గాయపడ్డ మరో వ్యక్తిని దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన చౌడుతండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తిరుపతిని పోలీసులు అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక డంపు సీజ్

చేర్యాల, ఏప్రిల్ 17: మండలంలోని వేచరేణి శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును స్థానిక తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్ గురువారం సీజ్ చేశారు. వేచరేణిలో దాదాపు 100 ట్రిప్పుల ఇసుక నిల్వ చేశారని సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడి వెళ్లి ఇసుక నిల్వను గుర్తించి సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై విచారణ జరుపనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐలు రాజేందర్‌రెడ్డి, ఐలయ్య, సిబ్బంది ఉన్నారు.

మేకల దొంగలు అరెస్టు

వర్గల్, ఏప్రిల్17: మండలంలోని మల్లారెడ్డిపల్లికి చెందిన చీర్ల మల్లేశం మేకలదొడ్డి నుంచి గతనెల 24న నాలుగు మేకలు ఎత్తుకెళ్లిన దొంగల ముఠాను గురువారం గౌరారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నీరజ్‌కుమార్, మాఖాన్ విశాల్‌సింగ్, రాహుల్ కలిసి కొంతకాలంగా గొర్రెలు, మేకలను లక్ష్యంగా చేసుకొని దొంగతనానికి పాల్పడుతున్నారు. గురువారం గౌరారం సెవన్ హిల్స్ హోటల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీస్ సిబ్బంది వారిని విచారించగా మేకలు చోరీ చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.